www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 17 నవంబర్ 2024
5
తిరుపతి

తల్లిదండ్రుల కళ్లముందే...
అక్కాతమ్ముడు మృతి

ప్రజాశక్తి - చిల్లకూరు

తిరుపతి జిల్లా చిల్లకూరు మండల పరిధిలోని ఏరూరు గ్రామంలోని అల్లిపురం గిరిజన కాలనీలో శనివారం విషాదం చోటు చేసుకుంది. తల్లిదండ్రుల కళ్లముందే చిన్నారులు ఇద్దరు మృత్యువాత పడ్డారు. అల్లిపురం గిరిజన కాలనీలో తల్లిదండ్రులు బట్టలు ఉతికేందుకు వెళ్లగా సొన కాల్వ ఒడ్డున ఆడుకుంటూ ప్రమాదవశాత్తు చింతాలయ్య (10), నాగేంద్రమ్మ (11) అక్కతమ్ముడు మృతిచెందారు. ఘటన స్థలానికి చిల్లకూరు పోలీసులు చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. కళ్లముందే బిడ్డలు మృతిచెందడంతో తల్లిదండ్రుల ఆవేదన వర్ణనాతీతం. వీరి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

చంద్రబాబు ఇంట విషాదం

నారా రామ్మూర్తినాయుడు మృతి
నేడు నారావారిపల్లిలో అంత్యక్రియలు
రానున్న నారా, నందమూరి కుటుంబీకులు
ఏర్పాట్లలో అధికార యంత్రాంగం

అన్నదమ్ముల అనుబంధం (ఫైల్)

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి)

ఏపి సిఎం చంద్రబాబునాయుడు ఇంట్లో విషాదం నెలకొంది. తమ్ముడు నారా రామ్మూర్తినాయుడు (72) హైదరాబాద్ గచ్చిబౌలి ఏఐజి ఆస్పత్రిలో అనారోగ్యంతో శనివారం మధ్యాహ్నం మృతిచెందారు. ఆయన పార్థివదేహాన్ని ఆదివారం ఉదయం తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం నారావారిపల్లికి తీసుకురానున్నారు. సాయంత్రం అంత్యక్రియలు జరగనున్నాయి. నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్ కుటుంబ సభ్యులు, నందమూరి బాలకృష్ణ కుటుంబ సభ్యులు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, దగ్గుపాటి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అందరూ నారావారిపల్లికి ఆదివారం రానున్నారు. నారావారిపల్లిలో విషాదఛాయలు అలముకున్నాయి. నారా రామ్మూర్తి కుమారుడు ప్రముఖ హీరో నారా రోహిత్.

నారా ఖర్జూరనాయుడు, అమ్మణ్ణమ్మల సంతానం నారా చంద్రబాబునాయుడు, తమ్ముడు నారా రామ్మూర్తినాయుడు, రాజేశ్వరి, హైమావతి ఉన్నారు. వీరిది వ్యవసాయ కుటుంబం. తండ్రి ఖర్జూరనాయుడుకు తోడుగా రామ్మూర్తి వ్యవసాయ పనులు చేసేవారు. ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసిన తరువాత నాటకాలపై ఆసక్తితో స్నేహితులతో కలిసి తిరుపతిలో కళాపరిషత్ ఏర్పాటు చేసి నాటకాలు వేసేవారు. తరువాత కాంట్రాక్టులు చేశారు. అన్న నారా చంద్రబాబునాయుడు రాజకీయాల్లోకి రావడంతో చేదోడువాదోడుగా ఉంటూ వచ్చారు. 1977లో చంద్రగిరి, పులిచర్ల మండలాల్లో పార్టీ అభివృద్ధికి పనిచేశారు. 1992లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. 1994లో టిడిపి తరపున అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి గల్లా అరుణకుమారిపై పోటీచేసి గెలుపొందారు. నియోజకవర్గంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. 1996-98లో రాష్ట్ర కబడ్డీ సంఘం ఛైర్మన్‌గా పనిచేశారు. 1996లో చంద్రగిరిలో రాష్ట్ర జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. 1998లో తిరుపతి తారకరామారావు స్టేడియంలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించి అప్పటి హోంమంత్రి దేవేందర్ గౌడ్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. 1999లో ఓటమి తర్వాత మానసిక క్షోభకు గురయ్యారు. ఆ తర్వాత 2002 నుంచి ఆయన ఆరోగ్యం కొద్ది కొద్దిగా క్షీణిస్తూ వచ్చింది. 2003లో ఢిల్లీలో సోనియా గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ చేరారు. శ్రీకాళహస్తి నుంచి పోటీ చేయాలని అధిష్టానం ఆదేశించింది. ఆయన విభేదించి 2004లో చంద్రగిరి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గల్లా అరుణకుమారి, రామనాథంలపై పోటీ చేసి 36వేలు పైచిలుకు ఓట్లు సాధించారు. కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవాలయ అభివద్ధికి చంద్రగిరి ఎమ్మెల్యేగా నారా రామ్మూర్తి నాయుడు ఎంతో కృషి చేశారు. ఆలయ అభివద్ధికి రైతుల నుంచి భూములను సేకరించి శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ అభివద్ధిలో చెరగని ముద్ర వేసుకున్నారు. చిన్నప్పటినుంచి వరుసలతో ఊళ్లోవారిని అత్తమామ, చిన్నాన్న, అన్నా, అవ్వ తాత అంటూ ఆప్యాయంగా పలకరించే రామ్మూర్తి మృతితో నారావారిపల్లిలో విషాదఛాయలు అలముకున్నాయి.

పాత జ్ఞాపకాలు... ఎస్వీయూలో 2008 ఎన్టీఆర్ ప్రతిభా పురస్కార సభలో ముఖ్యఅతిథిగా రామ్మూర్తి నాయుడు, చిత్రంలో ప్రస్తుత శాప్ ఛైర్మన్ రవి నాయుడు

నేడు నారావారిపల్లికి పార్థివదేహం

ఏపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తమ్ముడు నారా రామ్మూర్తినాయుడు గుండెకు సంబంధించిన సమస్యతో హైదరాబాద్ గచ్చిబౌలిలో ఉన్న ఏఐజి ఆస్పత్రిలో ఈనెల 14న చేరారు. చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం 12.45 గంటలకు తుదిశ్వాస విడిచారని ఆస్పత్రి వైద్యులు వెల్లడించారు. ఆదివారం ఉదయం హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో రేణిగుంటకు పార్థివదేహాన్ని తరలిస్తున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు అంత్యక్రియలు జరగనున్నాయి. ఢిల్లీ పర్యటనలో ఉన్న చంద్రబాబునాయుడు తమ్ముని మరణవార్త తెలుసుకుని మహారాష్ట్ర ఎన్నికల ప్రచారానికి వెళ్లాల్సిన షెడ్యూల్‌ను రద్దు చేసుకుని హైదరాబాద్‌కు వచ్చి నివాళి అర్పించారు.

తరలిరానున్న బంధుమిత్ర, సినీ ప్రముఖులు

నారా రామ్మూర్తినాయుని అంత్యక్రియలకు రాజకీయ, సినీ ప్రముఖులు రానున్నారు. ఏపి సిఎం నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం కొణిదెల పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌తో పాటు, నారా, నందమూరి, దగ్గుపాటి కుటుంబ సభ్యులు హాజరుకానున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి రాజకీయ నాయకులు భారీగా తరలి రానున్నారు.

నారావారిపల్లెలో గట్టి బందోబస్తు

నారా రామ్మూర్తి నాయుడు అంత్యక్రియలు ఆదివారం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో రాజకీయ ప్రముఖులు హాజరుకానున్న నేపథ్యంలో తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు నారావారిపల్లిలో గట్టి పోలీస్ బందోబస్తు, కారు పార్కింగ్, ట్రాఫిక్ నిబంధనలకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్య ఏర్పాట్లనున పరిశీలించారు. స్థానిక శాసనసభ్యులు పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని), టిడిపి శ్రేణులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

పలువురి సంతాపం

నారా రామ్మూర్తినాయుడు మృతికి ఉమ్మడి చిత్తూరు జిల్లా రాజకీయ ప్రముఖులు సంతాపం ప్రకటించారు. కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్, ఎంఎల్ఎలు ఆరణి శ్రీనివాస్, బొజ్జల సుధీర్‌రెడ్డి, టిడిపి నాయకులు సుగుణమ్మ, అన్నా రామచంద్రయాదవ్, వైసిపి మాజీ ఎంఎల్ఎ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి సంతాపం తెలిపారు. రాజకీయ రంగంలో అజాతశత్రువుగా రామ్మూర్తి నిలిచిపోతారన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ మాదాల భూపతినాయుడు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఏర్పాట్లలో అధికార యంత్రాంగం

గురుకులాల్లో ఏం జరుగుతోంది..?

తిరుపతిలోనూ 32 మంది బాలికలకు అస్వస్థత

విద్యార్థులను పరామర్శిస్తున్న విద్యార్థిసంఘం నాయకులు

తిరుపతి జిల్లా గురుకులాల్లో మౌలిక వసతుల లేమి విద్యార్థుల అనారోగ్యానికి కారణమవుతోంది. అధికార యంత్రాంగం, గురుకులాల సిబ్బంది నిర్లక్ష్యం వెరశి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నిన్నగాక మొన్న సత్యవేడులో బాలుర గురుకుల పాఠశాలలో 90 మంది విద్యార్థులకు జ్వరాలొచ్చాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించి ప్రత్యేకంగా చికిత్స అందించారు. తాజాగా తిరుపతి బైరాగిపట్టెడ గురుకులంలో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. గతంలో నాయుడుపేట, డక్కిలి, రేణిగుంటల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సత్యవేడులో జ్వరంతో చికిత్స పొందుతున్న విద్యార్థినులను తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తి శనివారం పరామర్శించారు.

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతి నగరం బైరాగిపట్టెడ సమీపంలోని ట్రైబల్ బాలికల గురుకుల వసతి సముదాయంలో కలుషిత ఆహారం తిని 32 మంది విద్యార్థినిలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అస్వస్థతకు గురైన 17 మంది విద్యార్థినులను హుటాహుటిన తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. విద్యార్థినిలను ఎంఎం వార్డులో ప్రత్యేకంగా ఉంచి చికిత్సను అందించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని, గురుకుల పాఠశాలలో మెరుగైన చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం వరకు ఆసుపత్రుల్లోనే వుండి వైద్య సేవలను పర్యవేక్షించారు. రుయా సూపరింటెండెంటు డాక్టర్ రవి ప్రభు, విభాగాధిపతులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గురుకుల విద్యార్థినుల ఆరోగ్యం మెరుగుపడడంతో శనివారం మధ్యాహ్నం డిశ్చార్జ్ చేసి వసతి గృహానికి తరలించారు. అస్వస్థతకు గురైన 32 మంది విద్యార్థినుల్లో కొందరికి వాంతులు, మరికొందరికి విరోచనాలు, మరికొందరికి కడుపునొప్పి సమస్యలు ఎదురయ్యాయి. ఇందులో 17 మందిని రుయా ఆసుపత్రికి తరలించి వైద్యం అందించగా 15 మందికి వసతి గృహం లోనే చికిత్సను అందించారు. ప్రస్తుతం అందరి ఆరోగ్యం స్థిరంగానే ఉన్నట్లు వైద్యులు ధ్రువీకరించారు. శుక్రవారం మధ్యాహ్నం వండిన మెంతిపప్పు కూర తిరిగి రాత్రికి వడ్డించడం వల్లనే ఫుడ్ పాయిజన్ అయ్యిందని అధికారులు అంచనాకు వచ్చారు. అలాగే తాగునీరు, ఆహార శ్యాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు తరలించారు.

విద్యార్థిసంఘాల పరామర్శ

ఫుడ్ పాయిజన్‌తో చికిత్స పొందుతున్న విద్యార్థినులను విద్యార్థిసంఘాల నాయకులు శనివారం పరామర్శించారు. టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు కొట్టె హేమంత్ రాయల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అక్బర్, రవి, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి జె.మల్లికార్జున, బిసి విద్యార్థిసంఘం నాయకులు నారాయణ గౌడ్ ఉన్నారు. జిల్లావ్యాప్తంగా వరుస ఘటనలు చోటు చేసుకుంటున్నా అధికార యంత్రాంగం మొద్దునిద్రలో ఉందని విమర్శించారు. కలెక్టర్ తక్షణమే స్పందించి గురుకుల పాఠశాలలో తాగడానికి మంచినీరు, మంచి ఆహారం, బాత్రూం సదుపాయాలు కల్పించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా ప్రిన్సిపాల్స్ కు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

సత్యవేడులో సిపిఎం, ఎంపి పరామర్శ

సత్యవేడు : సత్యవేడు లోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో జ్వరాలతో తీవ్ర అస్వస్థతకు గురై వైద్యం పొందుతున్న విద్యార్థులను సత్యవేడు నియోజకవర్గ సిపిఎం ఇన్‌ఛార్జి దాసరి జనార్ధన్, మండల కార్యదర్శి మెలుగు రమేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు టంగుటూరి మురళితో కలిసి పరామర్శించారు. పాఠశాలలో ప్రత్యేక ఐసోలేషన్ గదిలో వైద్యం పొందుతున్న విద్యార్థులతో మాట్లాడుతూ అనారోగ్య సమస్యలు ఎదురైతే వెంటనే వైద్యులకు తెలిపి మెరుగైన వైద్యం తీసుకోవాలని సూచనలు ఇచ్చారు. అనంతరం పరిసరాలను పరిశీలించారు. ఎటు చూసినా లీకేజీ స్లాబ్లు, అపరిశుభ్ర మరుగుదొడ్లు కనిపించాయి. వంటశాలలో పాడైన, కుళ్లిపోయిన నాసి రకం కూరగాయలను ఉపయోగించడాన్ని గమనించారు. ఈ కూరగాయలతో ఎలా వండుతారని వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయానికి విద్యార్థులను పరామర్శించడానికి వచ్చిన తిరుపతి ఎంపీ గురుమూర్తికి పాడైన కాయగూరలను చూపించి వంటశాలను పరిశీలించవలసిందిగా కోరారు. ఆ మేరకు ఎంపీ గురుమూర్తి స్పందించి వంటశాలను పరిశీలించి పాఠశాల ప్రిన్సిపాల్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యమైన తాజా కాయగూరలను వంటకు వాడవల్సిందిగా ఆదేశించారు. ఇంతమంది విద్యార్థులకు జ్వరం ప్రబలడానికి అపరిశుభ్ర పరిసరాలు, మరుగుదొడ్లు, కలుషిత ఆహారమే ప్రధాన కారకంగా ఉండొచ్చని సిపిఎం నాయకులు దాసరి జనార్ధన్ అనుమానం వ్యక్తపరిచారు. ఇలాంటి దుస్థితికి కారణమైన పాఠశాల యాజమాన్య సిబ్బందిపై అధికారులు కఠిన చర్యలు చేపట్టి ఇలాంటి సంఘటనలు పునరావత్తం కాకుండా చూడాలని కోరారు.

గురుకుల పాఠశాల పరిసరాలు పరిశీలిస్తున్న ఎంపి మద్దిల గురుమూర్తి, సిపిఎం నాయకులు దాసరి జనార్ధన్

మినీలను 'మెయిన్'గా గుర్తించాలి

జోరువానలోనూ అంగన్‌వాడీల నిరసన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

మినీలనూ మెయిన్ అంగన్‌వాడీలుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర పిలుపు మేరకు తిరుపతి కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు జోరు వానలోనూ నిరసన తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆందోళన కొనసాగింది. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం సమర్పించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం, యూనియన్ అధ్యక్షురాలు పద్మలీల, ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి, నాయకులు జయచంద్ర, లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గర్భిణులకు, బాలింతలకు, చిన్న పిల్లలకు అంగన్‌వాడీ సెంటర్లు సేవలందిస్తున్నాయన్నారు. మినీ అంగన్‌వాడీలకు హెల్పర్ వర్కర్ ఒకరే కావడంతో పనిభారం పెరిగిపోయిందన్నారు. మినీ వర్కర్లకు మెయిన్ వర్కర్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ జీవో ఉన్నప్పటికీ అమలు కావడం లేదన్నారు. పిల్లల సంరక్షనే కాకుండా యాప్‌ల పేరుతో పనిచేయలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. 42 రోజుల పాటు సమ్మె

నిర్వహించిన సందర్భంగా చర్చలు జరిపి అగ్రిమెంట్ చేసుకున్నా, ఇంతవరకూ అమలు చేయలేదన్నారు. అందరినీ జీతాలు పెంచుతామని హామీ ఇచ్చిన చంద్రబాబునాయుడు 150 రోజులు గడుస్తున్నా పట్టించుకోలేదన్నారు. తక్షణమే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు మునిరాజా, అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు శ్యామల, ఇంద్రాణి, శాంతి, సౌజన్య, ముని కుమారి, ధనమ్మ, భాగ్యలక్ష్మి, నాగభూషణమ్మ, మోహన్ కుమారి, సుశీల, జయ, లావణ్య, ధనలక్ష్మి, ప్రభావతి ఇంద్రావతి, పాండురంగమ్మ, విజయ్ కుమారి పాల్గొన్నారు.

రైతులకు శాస్త్రీయ సలహాలివ్వాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించేందుకు శాస్త్రీయతతో కూడిన సలహాలివ్వాలని తిరుపతి వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ నాగమణి సూచించారు. స్థానిక ఏపీ సీడ్స్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన వ్యవసాయ శాఖ విస్తరణ సిబ్బంది శిక్షణలో ఆమె పాల్గొని ప్రసంగించారు. విత్తనశుద్ధితో తొలిదశ చీడ, పీడలను అదుపు చేయవచ్చని తెలిపారు. సేంద్రియ ఎరువులను విరివిగా వాడకం వలన భూమి ఆరోగ్యం మెరుగుపడి పంట బాగా వస్తుందని వివరించారు. వరి పొలాలకు అధికంగా కాంప్లెక్స్ ఎరువులని వాడటం వల్ల భూములు చౌడుబారి అనేక సూక్ష్మపోషక లోపాలు కనిపిస్తాయని తెలిపారు. సక్రమ నీటి యాజమాన్యం ద్వారా చీడల బెడద తగ్గి పంట నాణ్యంగా వస్తుందన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏవో వేణుగోపాలరావు, రేణుక బయోఫామ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజేంద్రనాథ్ రెడ్డి, రాస్ కేవికే శాస్త్రవేత్త డాక్టర్ దివ్య, భాస్కరయ్య సూర్యప్రకాష్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, ఏడీఏ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుడా టవర్స్ నిర్మాణంలో నాణ్యత పాటించాలి

తిరుపతి టౌన్ : తిరుపతి పట్టణాభివద్ధి సంస్థ (తుడా) ఆధ్వర్యంలో రాయల చెరువు రోడ్డు లో నిర్మిస్తున్న తుడా టవర్స్ నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తుడా ఉపాధ్యక్షులు, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను, నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. శనివారం నగరంలోని రాయల్ చెరువు రోడ్ లో నిర్మిస్తున్న తుడా టవర్స్ నిర్మాణంలో వినియోగిస్తున్న వస్తువుల నాణ్యత ప్రమాణాలను ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం తుడా కార్యాలయంలో అధికారులతో సమావేశమై సమీక్షించారు. వీలైనంత త్వరగా పనులు చేస్తే విక్రయానికి వేలం నిర్వహించేందుకు వీలుంటుందని అన్నారు. ఉపాధ్యక్షుల వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ కష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర, అడ్వైజర్ రామకష్ణ రావు, డి.ఈ.భాషా, ఏ.ఈ.షణ్ముగం, కె.పి.సి సంస్థ ఈ.డి.సుశీల్ కుమార్ ఉన్నారు.

శివ సేవకులకు ఆహ్వానం : ఎమ్మెల్యే బొజ్జల

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

వచ్చే ఏడాది శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించనున్న మహా శివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలకు శివసేవకులకు ఆహ్వానం పలుకుతున్నట్లు ఎంఎల్ఎ బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. శాశ్వత విద్యుత్ దేవతా రూపాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. తద్వారా ఆలయానికి ఏటా రూ. 2 కోట్ల భారం తగ్గుతుందని తెలిపారు. ఆలయం పరిపాలన సమావేశ మందిరంలో శనివారం ఎమ్మెల్యే ఆలయ ఉద్యోగులు, సిబ్బందితో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గతంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల బడ్జెట్ తో పాటు విద్యుత్ దీపాల దేవతామూర్తుల అలంకరణకు మరో రెండు కోట్లు అదనంగా ఖర్చు చేసేవారని విమర్శించారు. అలాకాకుండా ఆలయ నిధులు వెచ్చించి శాశ్వత విద్యుత్ దేవతా రూపాలను ఏర్పాటు చేస్తే తదుపరి నిర్వహించే ఉత్సవాలకు ఖర్చు మిగులుతుందని తెలిపారు. ట్రాఫిక్ సమస్యకు ఎంజిఎం ప్రక్కన వున్న కరకట్టపై పరిష్కారం చూపుతామని తెలిపారు. వచ్చే ఏడాది నుంచి ఆన్ లైన్ నగదు చెల్లింపులు చేస్తామన్నారు. అనంతరం శ్రీకాళహస్తీశ్వరాలయ 2025 క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈవో బాపి రెడ్డి, ఈఈ మురళిధర్ రెడ్డి, డీఈ శ్రీనివాసులు రెడ్డి, ఆలయం ఏఈఓ కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరుమలలో కార్తీక వన భోజనం

ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలో కార్తీక వన భోజన కార్యక్రమాన్ని ఆదివారం శ్రీవారి ఆలయం సమీపంలోని వైభవోత్సవ మండపంలో ఆదివారం టీటీడీ నిర్వహించనుంది. సాధారణంగా పార్వేట మండపంలో ఈ కార్యక్రమం జరగడం ఆనవాయితీ. వాతావరణ శాఖ భారీ వర్ష హెచ్చరికల నేపథ్యంలో ఈ ఏడాది వైభవోత్సవ మండపంలో నిర్వహించాలని టీటీడీ నిర్ణయించింది. పవిత్రమైన కార్తీకమాసంలో వనభోజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఉత్సవం కారణంగా శ్రీవారి అలయంలో నిర్వహించే కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

పోర్టును ప్రారంభిస్తేనే అభివృద్ధి : కాంగ్రెస్

ప్రజాశక్తి - గూడూరు టౌన్

విశాఖపట్నంలా గూడూరు అభివద్ధి చెందాలంటే దుగరాజపట్నం పోర్టు ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. గూడూరు పట్టణం లోని టవర్ క్లాక్ సెంటర్‌లో శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా చింతా మోహన్ మాట్లాడుతూ దుగ్గరాజపట్నం పోర్టును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడ్డుకుంటున్నారని తెలిపారు. అమరావతిని రాజధాని గా అభివద్ధి చేయాలంటే వందేళ్లు పడుతుందని అన్నారు. చంద్రబాబు నాయుడు పోలవరం, అమరావతి గుర్తించే మాట్లాడుతున్నారని, పోర్టు నిర్మాణం చేపట్టక పోతే నష్టం వస్తుందన్నారు. నాయకులు రామకృష్ణ పాల్గొన్నారు.

'ప్రజా' సమస్యల పరిష్కారానికై 'పోరు'

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఒక పక్క చాలీచాలనీ వేతనాలు, నిరుద్యోగం, దీనికి తోడు మూలిగేనక్కపై తాటికాయ పడ్డ చందానా అధిక ధరలు. మరో పక్క రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు, హత్యలు. పాలకులు స్వార్థప్రయోజనాల కోసం జమిలి ఎన్నికలు, పోలవరం నిర్వాసితులు సమస్యలు ఎక్కడేసిన గొంగళి అక్కడే. ఆంధ్రుల హక్కయిన విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ... వీటన్నిటిని వ్యతిరేకిస్తూ పాలకుల తీరును నిరశిస్తూ ప్రజలను చైతన్యవంతులు చేస్తూ ప్రజాసమస్యల పరిస్కారినికై సిపిఎం రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా పోరుకు పిలుపునిచ్చింది. అందులో భాగంగా ఈ నెల 8 నుంచి 15వ తేది వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో, మండల కేంద్రాల్లో ప్రచారం నిర్వహించి, నిరసన తెలియజేసింది.

ధరలుపైపైకి.... ఉపాధి అవకాశాలు నిల్...!

గత నెల రోజుల కాలంలో కూరగాయలు, నిత్యావసర వస్తువులు, వంటనూనెలు ఆకాశాన్నంటాయి. పండగల సందర్భంగానూ, రోజువారి సరుకుల కొనుగోల్లలోనూ ధరల ప్రభావం కనిపిస్తోంది. ధరలను అదుపుచేయాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకునీరెత్తినట్లు ఉండడం గమనార్హం. రేషన్ షాపుల ద్వారా అయినా సామాన్యులకు సరసమైన ధరలకు నిత్యవసర వస్తువులు ఇవ్వడంలోనూ నిర్లక్ష్యమే. మరోపక్క రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు వస్తాయని ఎదురుచూస్తున్న యువత నిరాశకు గురువుతంది. డిఎస్‌సి వాయిదా పడింది. గిరిజన నిరుద్యోగులకు ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించలేదు. గ్రూప్-1, గ్రూప్-2 అగమ్యగోచరంగానే ఉన్నాయి. కోచింగ్‌లు తీసుకున్న యువత అయోమయంలో ఉన్నారు.

పెరుగుతున్న దాడులు...పెట్రేగుతున్న దోపిడి

రాష్ట్రంలో మహిళలు పిల్లలు, దళితులపై అత్యాచారాలు, హత్యలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. గత ప్రభుత్వానికి భిన్నమైన పాలన అందిస్తామన్న కూటమి వాగ్దానాలు అమల్లోకి రాలేదు. అవినీతీ విచ్చలవిడిగా సాగుతోంది. ఇసుక, మద్యం మాఫీయాలు చెలరేగిపోతున్నాయి. గంజాయి విక్రయాలకు అడ్డుకట్టే లేదు. మరోపక్క విద్యుత్ చార్జీలు పెంచబోమంటూనే ట్రూఆఫ్ చార్జీల పేరుతో 20వేల కోట్ల రూపాయల భారాన్నీ ప్రజలపై మోపారు. మరో పక్క స్మార్ట్ మీటర్లను బిగించే పని వేగవంతం చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో వరద సహాయం తగిన విదంగా అందించలేదు. ఎన్యుమరేషన్‌లో అవకవతవకలు. కౌలురైతులకు తీరని అన్యాయం జరిగింది. సూపర్ 6 సహా కూటమీ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్ని అటకెక్కాయి. రోడ్లన్ని పాడయిన పట్టించుకునే నాధుడే లేడు. గుంతలు మాత్రం పూడ్చుతామని చెబుతూ ప్రచారాలకే పరిమితం అవుతున్నారు. లబ్దిదారులకు ప్రభుత్వ ఇళ్ల నిర్మాణం లేదు. టిడ్కో ఇళ్లను లబ్దిదారులకు అప్పగించలేదు. మెడికల్ కళాశాలలను పిపిపి పేరుతో ప్రయివేట్ పరం చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం అందడం లేదు. గ్రామాల్లో, పట్టణాల్లో అనేక చోట్ల దళితుల స్మవాన, ఇతర సమస్యలు తీవ్రంగా ఉన్నాయి.

జిల్లా వ్యాప్తంగా ఇటీవల బారీ వర్షాలు నమోదవుతున్నాయి. అనేక లోతట్టు ప్రాంతాలు, తూర్పు మండలాల్లో పంటలు సైతం వరదపాలయ్యాయి. వాటిని అంచనా వేయడంలోనే ఇంకే వెనకంజులో ఉన్న అధికార యంత్రాంగం, బాధితులను ఎప్పుడు ఆదుకుంటుందో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రజలందరు ప్రభుత్వ తీరుపై అక్రోసం వెలగక్కుతున్నారు. సామాన్యులు, మద్యతరగతి, పేద, కార్మిక వర్గాలు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని, పాలకుల తీరులో మార్పు తీసుకురావాలనే ఉద్దేశంతో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలను చైతన్యవంతులను చేసి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ నెల 8 నుంచి 15వ తేది వరకు ప్రజా పోరుకు కమ్యూనిస్టులు పిలుపునిచ్చారు. అందులో బాగంగా జిల్లాలోని అన్ని మండల కార్యాలయాలు, జిల్లా కలెక్టరేట్ వద్ద బారీ ఎత్తున ప్రజలతో బారీ నిరసనలు, ధర్నాలు జరిగాయి. రాష్ట్రస్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయాలపై ప్రభుత్వ పెద్దలకు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని జిల్లా అధికారులు ప్రజలకు హామీ ఇచ్చారు. ఇప్పటికైన ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించి, జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గం చూపుతారని ఆశిద్దాం.

14న లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సులోచన రాణి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : డిసెంబర్ 14వ తేదీ దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సులోచన రాణి పేర్కొన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సులోచన రాణి పోలీసులు, న్యాయవాదులతో లోక్ అదాలత్ నిర్వహణపై శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసుల శాశ్వత పరిష్కారానికి రాజీయే రాచమార్గం అన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, బ్యాంక్, బిఎస్ఎన్ఎల్, ఎలక్ట్రిసిటీ కేసులు, భూ తగాదాలు, ఇతర కేసులను రాజీ మార్గంలో ఇరు వర్గాల సమ్మతితో రాజీ చేస్తామని తెలిపారు. కక్షి దారులు ఈ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

పుత్తూరు టౌన్ : డిసెంబరు14 వతేదీ పుత్తూరు కోర్టు ఆవరణలో నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని పుత్తూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సి జానకి తెలిపారు. శనివారం పుత్తూరు కోర్టు ఆవరణలో పోలీస్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ లో అధిక సంఖ్యలో రాజీకి లోబడిన క్రిమినల్ కేసులను పరిష్కరించాలని తెలిపారు. రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, ధనం ఆదా అవుతుందన్నారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు, దానిపై అప్పీలు ఉండదన్నారు. ఈ సమావేశంలో వెదురుకుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ్య, ఎస్ఆర్‌పురం ఎస్ఐ సుమన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి జానకి

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం పుత్తూరు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి హెచ్ ప్రభాకర్ రాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాశాఖ అధికారి పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరుపై చర్చించారు. విద్యార్థిని విద్యార్థులకు ఉప విద్యాశాఖ అధికారి 10వ తరగతి పరీక్షలకు సంబంధించి కొన్ని సూచనలు, సలహాలు అందించారు. ప్రధానోపాధ్యాయులు రమణయ్యతో విద్యార్థుల భవిష్యత్తుపై చర్చించారు. మధ్యాహ్న భోజన పథకం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు రవీంద్రనాథ్, ఆవల సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక తయారు చేయాలి: ఎంపీడీవో

మాట్లాడుతున్న ఎంపిడివో రమేష్‌బాబు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక తయారు చేసుకోవాలి ఎంపీడీవో రమేష్ బాబు తెలిపారు. 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు (జిపిడిపి), మండల ప్రజాపరిషత్ అభివృద్ధి, ప్రణాళికలు (బిపిడి) రూపకల్పనకు ఎంపిపి మునివేలమ్మ అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. సర్పంచులు, ఎంపిటిసిలు, కో ఆప్షన్ నెంబర్లు, మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల రిసోర్స్ పర్సన్ కిషోర్ కుమార్ మాట్లాడుతూ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్య పరిష్కారం, వీధి లైట్లు, పారిశుధ్య కార్యక్రమాలతో పాటు ప్రభుత్వం చేపట్టే సంక్షేమ కార్యక్రమాల అమలు వంటి కార్యక్రమాలకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసి ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తీర్ణ అధికారి దీపిక, ఏఈపిఆర్, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ కార్యదర్శులు, ఏపీవో భార్గవి, పశు సంరక్షక శాఖ, అధికారి, వైద్యశాఖ అధికారులు, ఐసిడిఎస్ సూపరువైజర్లు, వ్యవసాయ శాఖ ఏవో డిజిటల్ అసిస్టెంట్లు, లీడర్లు పాల్గొన్నారు.

కామాక్షయ్యకు సన్మానం

కామాక్షయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు అందు కున్న పిచ్చాటూరు మండలం రాజానగరం జడ్పీ హైస్కూలు ఉపాధ్యాయుడు కామాక్షయ్యను నాగలాపురం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శనివారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇలంగోవర్ రెడ్డి, మాజీ సర్పంచ్ విజయ్‌కుమార్, మాజీ ఎంపిపి మురళి, ఎంపిటిసి ప్రేమ సెల్వకుమార్, ఎస్ఎం సురేష్, డాక్టర్ మస్తాన్, డాక్టర్ ఏడి శేషాద్రి, రాజమణిక్యం పాల్గొన్నారు.

గ్రంథాలయాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: పిల్లలకు గ్రంథాలయాలపై అవగాహన కల్పించాలని గ్రంథాలయ శాఖ అధికారి జీవన్ పేర్కొన్నారు. నారాయణవనం మండల కేంద్రంలో గ్రంథాలయ వారోత్సవాలు గ్రంథాలయ శాఖాధికారి జీవన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్రంథాలయ ఉద్యమకారులైన ఎస్ఆర్ రంగనాథన్ అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి పూలమాలవేసి వారు చేసిన ఉద్యమాలు గురించి క్షుణ్ణంగా వివరించారు. అనంతరం విద్యార్థినివిద్యార్థులకు చిన్నతనం నుండి పిల్లలను గ్రంథాలయం పట్ల అవగాహన కల్పించి గ్రంథాలయ పఠనాన్ని అలవాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జీవన్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : గ్రంథాలయ ఉద్యమకారులు కృషి వల్లే సమాజంలో గ్రంథాలయాలు అభివృద్ధి చెందాయని పుత్తూరు శాఖ గ్రంథాలయ అధికారి మీనా కుమారి తెలిపారు. గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు అయ్యంకి వెంకటరమణ, గాడిచర్ల హరి స్వర్ణోత్తమ రావు, పాతులూరు నాగభూషణం, గ్రంథాలయ శాస్త్ర ప్రముఖులు ఎస్ఆర్ రంగనాథం ముదలియార్ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ గ్రంథాలయం ఉద్యమకారుల ఆనాటి కృషివల్లే నేడు సమాజంలో గ్రంథాలయాలు అభివృద్ధి చెందాయని విద్యార్థులు తమ జ్ఞానం సముపార్జన, గ్రంథాలయాలను సంపూర్ణంగా వినియోగించుకుని తమ బంగారు భవిష్యత్తును గ్రంథాలయ పఠనం ద్వారా పొందాలన్నారు.

ఉత్తమ అధ్యాపకులకు విసి అభినందనలు

ఉత్తమ అధ్యాపకులను అభినందిస్తున్న విసి ఉమ

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్న ఆచార్యులను శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విసి ఆచార్య వి.ఉమ, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజనీ అభినందించారు. ఆచార్య శ్రీదేవి (ఫార్మసీ డిపార్ట్మెంట్), ఆచార్య ఆర్. ఉష, (బయోటెక్నాలజీ డిపార్టుమెంట్), ఆచార్య టి.సీతా కుమారి (లా డిపార్ట్మెంట్)లను వారి బోధన పరిశోధన, విద్యా రంగంలో వారు చేసినటువంటి కృషికి గాను ఈ అవార్డులు ప్రధానం చేశారని విసి వి ఉమ కొనియాడారు.

శ్రీ సిటీలో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్ట్

పోలీసుల అదుపులో వ్యక్తి

ప్రజాశక్తి - సత్యవేడు: శ్రీసిటీలో ఓ మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని శనివారం అరెస్టు చేసామని పోలీసులు తెలిపారు. తమిళనాడు ఆరంభాకానికి చెందిన ఒక మహిళ ఓ కంపెనీలో ఇంటర్వ్యూ నిమిత్తం సత్యవేడు మండలం ఆరూరు గ్రామంలో తన వదిన ఇంటికి వెళ్లి అక్కడ నుండి ఇంటర్వ్యూ కు వెళుతున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన వ్యక్తి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించిన పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. తమిళనాడుకు చెందిన మహిళ తన వదిన ఇంటి నుండి బయలుదేరిన అదే సమయంలో తన వదిన ఇంటికి ఎదురుగా నివాసముంటున్న ప్రసాద్ అనే వ్యక్తి అటువైపే వెళ్తున్నానని చెప్పి మోటర్ సైకిల్ పై ఆ మహిళను ఎక్కించుకొని ఆరూరు గ్రామ వెలుపలికి చేరగానే వెళ్లవలసిన మార్గంలో కాకుండా వేరేమార్గంలో దారి మళ్లించి ఆమెపట్ల అసభ్యకరంగా ప్రవర్తించి ఆమెపై అఘాయిత్యానికి ప్రయత్నించగా అతని నుండి తప్పించుకొని ఆమె బంధువుల దగ్గరకు చేరింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీసిటీ పోలీసు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి విచారణ అనంతరం నిందితుడు ప్రసాద్ ను అదుపులోకి తీసుకొని రిమాండ్ కు పంపినట్లు డీఎస్పీ పైడేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్పీ పైడేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు, బాలికలపై వేధింపు లకు, అఘాయిత్యాలకు పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు వెంటనే చేపడతామని దర్యాప్తులో భాగంగా కొన్ని సాక్ష్యాధారాలు సేకరించడానికి సమయం పడుతుందని కేసును కోర్టు ముందు నిరూపించడానికి బలమైన సాక్ష్యాధారాలు సేకరించవలసిన అవసరం వుందని, అయితే కొంతమంది మీడియా మిత్రులు ఇలాంటి విషయాలను కూడా దృష్టిలో వుంచుకుని దర్యాప్తు అధికారులు కానీ లేదా ఆపై అధికారులని కానీ సంప్రదించి మాత్రమే వివరాలను మీడియా ఇవ్వాలని సూచించారు. సొంత ఊహాగానాలతో మహిళలు, చిన్న పిల్లల విషయంలో ప్రచురించవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ డి శ్రీనివాసులు, ఎస్ఐ హరిప్రసాద్ పాల్గొన్నారు.

కాలువపై నిర్మాణాలను అడ్డుకున్న రైతులు

రోడ్డుపై నిర్మాణాన్ని అడ్డుకుంటున్న రైతులు

ప్రజాశక్తి - పెళ్లకూరు: కాలువపై నిర్మాణాలను రైతులు శనివారం అడ్డుకున్నారు. పెళ్లకూరు మండలంలోని పెన్నేపల్లి గ్రామ రెవెన్యూ సర్వే నెంబరు 100- 1 లో 35 సెంట్లు కాలువ పోరంబోకు భూమి వుంది. 50 ఎకరాలు వేదల్లుతో పెన్నేపల్లి చెరువు నుండి పంట పొలాలకు నీరు వెళ్లే ఈ కాలువ మధ్యలో ఎన్‌హెచ్ హైవే విద్యుత్ పోల్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ పోల్‌ను నిర్మిస్తే రైతులకు ఈ కాలువ పూడిపోయి నీరు నిలిచిపోయే ప్రమాదం వుందని రైతులు అడ్డుకున్నారు. సంబంధిత అధికారులకు విషయం తెలిసినా అధికారులు న్యాయం చేయకపోవడంతో రైతులు కోర్టును ఆశ్రయించారు. ఈ విషయం కోర్టులో ఉన్నప్పటికీ శనివారం ఎన్‌హెచ్ హైవే పనులు ప్రారంభించడంతో రైతులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న పెళ్లకూరు తహశీల్దార్ ద్వారకానాథ్ రెడ్డి, గతంలో ఉన్న ఏఈ మహేష్ సంఘటన స్థలం చేరుకుని తాత్కాలికంగా పనులను నిలుపుదల చేయించారు. ఇరిగేషన్ ఏఈ మహేష్ ఎడిసి ఇచ్చినట్టు సమాచారం, కోర్టు తీర్పు వచ్చేవరకు రైతులు నిర్మాణ పనులను నిలుపుదల చేయమనడంతో విరమించి రైతులకు న్యాయం చేస్తామని తహశీల్దార్ హామీ ఇచ్చారు.

ఈద్గా మైదానం సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్ : తిరుపతి ముస్లిం సోదరులు నమాజ్ చేసుకోవడానికి ఈద్గా మైదానం, షాదీ మహల్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు సకలంలో పూర్తిచేసేలా చూడాలని రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ శాఖ మంత్రి ఎండి ఫారుక్, ఐటి శాఖ మంత్రి లోకేష్‌ను శనివారం టిడిపి మైనార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ మహబూబ్ బాషా తాడేపల్లిలో కలిశారు. ఈ సందర్భంగా ఎస్ మహబూబ్ బాషా మాట్లాడుతూ ప్రతి ఏడాదీ రంజాన్, బక్రీద్ పండగల సందర్భంగా ముస్లిం సోదరులు ఈద్గా మైదానంలో నమాజ్ చేసుకోవడానికి ఎన్నో ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు. షాదీ మహల్ ఫ్లోరింగ్ తో పాటు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. వారికి వినతిపత్రాలను అందజేశారు

సిద్దార్థలో ఘనంగా ఫ్రెషర్స్‌డే

సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: నారాయణవనం మండల పరిధిలో ఉన్న సిద్దార్థ ఇంజినీరింగ్ విద్యా సంస్థలో ఫ్రెషర్స్‌డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఓపెన్ ఆడిటోరియంలో బిటెక్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులతో కలిసి ప్రొఫెసర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రార్థన గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రొఫెసర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ బీటెక్ ప్రొఫెసర్ విద్యార్థులు సీనియర్ విద్యార్థులతో సోదర భావంతో మెలగాలని వారి సహాయ సహకారాలు తీసుకొని తమ బీటెక్ కెరియర్‌ను విజయ వంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రిన్సిపల్ జనార్థన్ రాజు మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు, జూనియర్ విద్యార్థులతో కలిసిమెలిసి ఉండాలని వారికి ఆదర్శంగా ఉంటూ వారికి సాంకేతిక విజ్ఞానాన్ని అందించాలని తెలిపారు. విద్యార్థులు తమ కెరియర్‌ను విజయవంతంగా మలుచుకోవాలని సూచించారు. విద్యార్థిని విద్యార్థులు డాన్స్, సంస్కృతిక కొరియోగ్రపిలతో అలరింప చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ చంద్రశేఖర్ రెడ్డి, జనార్ధన్ రాజు, డిప్లమా ప్రిన్సిపల్ రమేష్, గుణప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ గోపీనాథ్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి: ఎమ్మెల్యే

మంత్రులను కలిసిన గూడూరు ఎమ్మెల్యే సునీల్‌కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్‌లను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాలు అందించి మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపి తమ గూడూరు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అసెంబ్లీ సమావేశాలలో భాగంగా విజయవాడ కు వెళ్లిన ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ అమరావతి సచివాలయంలో మంత్రులను కలిసి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఆయన వెంట గూడూరు నియో జక వర్గ టిడిపి నాయకులు బిల్లు చెంచురామయ్య తాతపూడి ఇశ్రాయేల్ కుమార్, ఎండి అబ్దుల్ రహీం, ఈసంశెట్టి నటశేఖర్, షేక్ షాహుల్, పత్రంగం వసంత్ పాల్గొన్నారు.

ముంతాజ్ హోటల్ భూ కేటాయింపు రద్దు చేయాలి: ఓంకార్

భూ కేటాయింపును రద్దు చేయాలని నిరసన తెలుపుతున్న ఓంకార్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వేంకటేశ్వరస్వామి సన్నిధిలో పాశ్చాత్య పోకడలను సృష్టించి ఆధ్యాత్మికతను చెరిపేయాలన్న ధోరణితో నిర్మిస్తున్న ఒబురాయి హోటల్స్‌కు చెందిన ముంతాజ్ హోటల్‌కు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 20 ఎకరాల భూమిని రద్దు చేయాలని తిరుక్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షులు తుమ్మా ఓంకార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఆధ్యాత్మికతను కాపాడుతామని, తిరుమల పవిత్రతను రక్షిస్తామని ఎప్పుడూ ప్రకటించే బిజెపి శ్రీవారి పాదాల చెంత తిరుపతి ఆధ్యాత్మికతను దెబ్బతీసే ముంతాజ్ హోటల్ నిర్మాణ పనులకు వ్యతిరేకంగా ఎందుకు పోరాడడం లేదని ప్రశ్నించారు. సనాతన ధర్మాన్ని కాపాడుతామని, సనాతన బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తిరుపతిలో సనాతన ధర్మం పక్కదారి పట్టేలా చేపట్టిన ముంతాజ్ హోటల్ నిర్మాణాన్ని, గత ప్రభుత్వం 24 జీవో ద్వారా కేటాయించిన 20 ఎకరాల భూమిని ఇప్పటి వరకు ఎందుకు రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వ నేతలు చెప్పే దొకటి.. చేసేదొకటిగా కనిపిస్తోందని, ప్రజల నుండి తిరుగు బాటు రాకముందే రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే టిటిడి బోర్డు సమావేశంలోనైనా ముంతాజ్ హోటల్‌కు గత ప్రభుత్వం కేటాయించిన 20 ఎకరాల భూమిని రద్దు చేయాలని, చర్చించి బోర్డు నిర్ణయం తీసుకొని ప్రభుత్వానికి పంపాలని కోరారు. లేని పక్షంలో మహా ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కిరణ్, రెడ్డి శేఖర్, రమాదేవి, పుష్పసుధ, నీలకంఠం, ధనంజయ రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పంచాయతీలోనే పరిష్కరించుకోవాలి : ఎంపిడీవో

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మంది రంలో శనివారం మండల ఎంపిటిసి, సభ్యులు, సర్పంచులు, కార్యదర్శులకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ త్రివిక్రమరావు మాట్లాడు తూ.. పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక కోసం పాఠశాల విద్యార్థులు, మహిళలు, రైతులతో మూడు సార్లు గ్రామసభలు నిర్వహించాలని కోరారు. స్థానికులతో గ్రామసభ నిర్వహించి, గ్రామా నికి కావాల్సిన మౌలిక వసతులు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి చర్చించి, అవసర మైన సమస్యలను గుర్తించాలన్నారు. 2025 జనవరి నాటికి గ్రామాల్లో సమస్యలు గుర్తించి వివరాలను అందించాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డి రాజశేఖర్, రిసోర్స్ పర్సన్స్ రజినీకాంత్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఎన్‌సిసి యూనిట్ ప్రారంభం

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని శ్రీ ప్రగతి విద్యా సంస్థల్లోని డిగ్రీ కాలేజీకి 2024-2025 సంవత్సరానికి ఎన్‌సిసి యూనిట్ మంజూరు అయింది. శనివారం ఆంధ్రా బెటాలియాన్ కు చెందిన ఆర్మీ అధికారులు జగన్మోహన్ రావు ఆనంద్ ఎన్‌సీసీ పట్ల ఆసక్తి కలిగిన విద్యార్థులకు పలు పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో అర్హులైన 25 మంది విద్యార్థులను ఎన్ సీసీ చేరికకు ఎంపిక చేశారు. అనంతరం శ్రీ ప్రగతి విద్యా సంస్థల చైర్మన్ పసుపులేటి.కిషోర్ ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ ఎన్‌సీసీ విద్యార్థులందరూ ఎన్‌సీసీ విధి విధానాలను సక్రమంగా వినియోగించుకుని, కష్టపడి చదివి ఉన్నతశ్రేణిలో నిలవాలని పలు సూచనలు, సలహాలును అందజేశారు.అనంతరం ఎన్ సీసీ అధికారి లెఫ్టినెంట్ ఎమ్.మునెయ్య, ఎన్ సీసీ ఎంపికైన విద్యార్థులకు ఎన్‌సీసీ ఉపయోగాలను,విధి విధానాలను తెలియజేస్తూ వారికీ అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్మీ అధికారులు, శ్రీ ప్రగతి విద్యా సంస్థల ఛైర్మన్ పసుపులేటి కిషోర్, ఎన్ సీసీ అధికారి లెఫ్టినెంట్ ఎమ్‌మునెయ్య, కళాశాల యాజమాన్యం పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా, నా క్లయింట్ చేజర్ల రజిని భర్త సి.వాసు సూచనల మేరకు దిగువ పేర్కొన్న షెడ్యూలు ఆస్తికి సంబంధించిన మూల పత్రం నెం. 1803/2011 తేది.10-06- 2011, ఒరిజినల్ కాపీని వారి ఇంటి వద్ద పోగొట్టుకున్నారు. కావున ఆ ఒరిజినల్ మూలపత్రముతో ఎటువంటి లావాదేవిలు జరిపిన అవి చెల్లనేరవు. సదరు ఒరిజినల్ డాక్యూమెంట్ ఎవరికైనా దొరికిన యెడల నాకు గాని లేక నా క్లయింట్ కు గానీ ఇవ్వవలసినది. అట్లు కాకుండా సదరు పత్రము పై ఏలాంటి విక్రయ, అగ్రిమెంట్, తనఖాలు చేసిన యెడల అవి చట్టరీత్యా ఎంతమాత్రము చెల్లనేరవు. అట్టివార్లపై నా క్లయింట్ తీసుకును సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని హెచ్చరించడమైనది. కావున క్రింద పేర్కొన్న షెడ్యూలు ఆస్తి పై ఎటువంటి ఆక్షేపణలు, ఆరోపణలు ఎవరికెనను ఉన్న ఎడల ఈ ప్రకటన ప్రచురించిన తేది మొదలు ఏడు (7) దినముల లోపల క్రింద తెలిపిన అడ్రస్సు కు తెలియపరచవలసినదిగా తెలియజేయడం

షెడ్యూలు

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు డిగ్రీ, గూడూరు రి॥ డి॥, వెంకటగిరి సబ్ డి॥, వెంకటగిరి మున్సిపాలిటి, వెంకటగిరిటౌన్, సర్వే నెం.279రు, వెల్లంకివారివీధిలో డోర్ నెం.16-136రుగల ఇంటికి దక్షణంవైపు సమీపము

1వ అయిటం ఖాళీస్థలమునకు హద్దులు (డాక్యుమెంట్ నెం. 376/2012రు ప్రకారం) తూర్పు పుణ్యకోటి హరగోపాల్ వగైరాల పెరడు స్థలం, దక్షణం 2వ అయిటం స్థలము, పడమర వీధి, ఉత్తరం బత్తిన రాంగోపాల్ ఇంటిగోడ

ఈ హద్దులలో 1వ అయిటం కొలతలు తూ॥ప॥ 12 అ॥లు, ఉ॥ద॥ 11 అ॥లు, వైశాల్యం 132 చ॥అ॥ల స్థలమున్నూ, సదరు 1వ అయిటమునకు పడమరవైపు 2వ అయిటం కొలతలు తూ?పపప దక్షణంవైపు 33.75 అ॥లు, ఉత్తరంవైపు 33.25 అ॥లు, ఉ॥ద॥ తూర్పువైపు 17.5 అ॥లు, పడమరవైపు 16.5 అ॥లు, వైశాల్యం 569.5 చ॥అ॥లు స్థలమున్నూ, సదరు 2వ అయిటమునకు ఉత్తరంవైపు 3వ అయిటం కొలతలు తూ॥ప॥ 17 అ॥లు, ఉ॥ద॥ 7 అ॥లు, వైశాల్యం 119 చ.అ॥లు స్థలమున్నూ, వెరశి మూడు అయిటములు చేరి 820.5 చ॥అ॥లు లేక 91.16 చ॥గ॥లు లేక 11.50 అంకణములు స్థలమున్నూ,

2వ అయిటం ఖాళీస్థలమునకు హద్దులు (డాక్యుమెంట్ నెం. 1037/2015రు ప్రకారం) తూర్పు ఈ ఆస్తికిన్నీ మోనాల రాంప్రసాద్ ఇంటికిని మధ్య వరసంధు, దక్షణం వీధి మరియు కన్నయ్య వగైరాల స్థలం, పడమర వీధి, ఉత్తరం 1వ అయిటం స్థలము

ఈ హద్దులలో రోడ్డు నుండి తూర్పువైపు 1వ అయిటం కొలతలు తూ॥ప॥ 7.9అ॥లు, ఉద॥ 19 అ॥లు, వైశాల్యం 150.1 చ.అ॥ల లేక 16.67 చ॥గ॥లు స్థలమున్నూ, సదరు 1వ అయిటమునకు తూర్పు ఈశాన్యమువైపు 2వ అయిటం కొలతలు తూ॥ప॥ 19 అ॥లు, ఉ॥ద॥ తూర్పువైపు 6.3 అ॥లు, వైశాల్యం 119.7 చ.అ॥లు లేక 13.3 చ॥గ॥లు స్థలమున్నూ, సదరు 2వ అయిటమునకు తూర్పువైపు 3వ అయిటం కొలతలు తూ॥ప॥ 19 అ॥లు, ఉద॥ 12 అ॥లు, వైశాల్యం 228 చ॥అ॥లు లేక 25.33 చ॥గ॥లు స్థలమున్నూ, సదరు 3వ అయిటమునకు ఈశాన్యంవైపు 4వ అయిటం కొలతలు తూ॥ప॥ 11 అ॥లు, ఉ॥ద॥ 5.10 అ॥లు, వైశాల్యం 56.1 చ.అ॥లు లేక 6.23 చ॥గ॥లు స్థలమున్నూ, వెరశి నాలుగు అయిటములు చేరి 553.9 చ॥అ॥లు లేక 61.54 చ॥గ॥లు లేక 7.69 అంకణములు స్థలమున్నూ, రెండు అయిటములు వెరశి 152.70 చ॥గ॥లు స్థలమున్నూ, సదరు స్థలమునకు చెందిన యావత్తు ఈజ్మెంట్ హక్కులతో సహా నీకు, నేను స్వాధీన పర్చినాను.

ఆర్.రాజేష్, అడ్వకేట్
డి.నెం. 12-6-12, ప్రశాంతి నగర్, తిరుచానూరు.
66 30.9640720904

క్రైం న్యూస్

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎంజీఎం కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి మునిశ్యాం అదృశ్యంపై స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పట్టణంలోని సాలిపేటకు చెందిన మునిరాజా కుమారుడు మునిశ్యాం(17) శుక్రవారం యథావిధిగా కాలేజీకి వెళ్లాడు. ఇంటికి తిరిగి వచ్చాక స్నేహితుడి ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వచ్చాడు. తీరా ఎంతకీ ఇంటికి తిరిగి రాకపోవడంతో అన్నిచోట్లా వెతికి చూశారు. వివరాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసినవారు టూ టౌన్ సీఐ వెంకటేశు ఫోన్ నంబర్: 9440900008కు సమాచారం అందించాలని కోరారు.

జెవివి అందించిన జ్ఞాపికలతో విద్యార్థులు

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్: స్థానిక లిటిల్ ఏంజెల్స్ పాఠశాలలో జెవివి ఆధ్వర్యం లో నిర్వహించిన చెకుముకి మండల స్థాయి పరీక్షలలో జెవివి విజేతలైన విద్యార్థులకు జెవివి సభ్యులు ముఖ్య అతిథులుగా ఎంఈఓ రఫూఫ్, చేతుల మీదుగా శనివారం మెమెంటోలు, బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెవివి 32 ఏళ్లగా విద్యార్థులను భావి భారత పౌరులుగా, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా తీర్చిదిద్దేందుకు సైన్స్ పరీక్షలు నిర్వహిస్తూ వారిలో చైతన్యం నింపటం అభినందనీయమన్నారు. చైతన్యంతో పాటూ మొక్కలు నాటే కార్యక్రమాలు చేస్తూ, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేస్తున్న జెవివి సభ్యులను అభినందించారు. చదువు ఆవశ్యకత, ప్రాముఖ్యత గురించి పాటల రూపంలో ఆలపించారు. ఈ కార్యక్రమంలో జెవివి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, ఎల్ఏపి హెచ్ఎం సురేష్, నాగరాజు, చెంచునారాయణ, శ్రీనివాసాచారి, పురుషోత్తమరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని శనివారం ఉదయం మండల విద్యాశాఖ అధికారి ముని సుబ్రహ్మణ్యం లక్ష్మీపురం పాఠశాలను తనిఖీ చేశారు. మొదట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులను, చదువును వారి గురించి కనీస వసతులను గురించి మాట్లాడి ప్రార్థన సమయంలో పాల్గొన్నారు. అనంతరం నెలవాయి లోని జిల్లా పరిషత్ లో మధ్యాహ్న భోజనం పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. బుచ్చి నాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పర్యటించి విద్యార్థులు చదువు ఏ రేంజ్‌లో ఉందో విద్యార్థిని విద్యార్థులను ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. వారి రోజువారి హోంవర్కును పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు రోజువారి హోంవర్క్ ఇచ్చి ఆ హోంవర్క్ ఉదయం పాఠశాలకు వచ్చేటప్పుడు కచ్చితంగా చేసుకొని రావాలని దానికి తల్లిదండ్రులదే బాధ్యత అని ఆయన సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాలలోమధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. నాగలాపురం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో రైతులకు ప్రభుత్వ సబ్సిడీ వేరు శెనగ విత్తనాలను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శనివారం పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అన్నదాతను ఆదుకోవడానికి అన్ని విధాలుగా కృషి చేస్తుందన్నారు. ఏవో సుబ్బారావు మాట్లాడుతూ సోమవారం నుండి మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో సబ్సిడీ వేరుశనగ విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఈఓడిఆర్‌డి వెంకటరత్నమ్మ, నాయకులు ఇలంగోవన్ రెడ్డి, సెల్వకుమార్, విజయకుమార్, ఎస్ఎం సురేష్, మురళీ పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యం దేశ వికాసానికి సౌభాగ్యం

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: పిల్లల ఆరోగ్యం దేశ వికాసానికి సౌభాగ్యం అని, పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆరోగ్యాధికారి డాక్టరు దర్శత్ రాజు పేర్కొన్నారు. రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం' (ఆర్‌బికెఎస్‌కె)ను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దర్శత్ రాజు, కశింమిట్ల గ్రామ పంచాయతీ సర్పంచ్ శనివారం నారాయణవనంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ దర్శిత్ రాజు మాట్లాడుతూ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రతి స్కూలును సందర్శించి హెల్త్ కార్డుల వివరాలు సేకరించి పిల్లలకు ఏసమస్య వుందో పరిష్కరిస్తారన్నారు. ఆరు నెలలకు ఒకసారి ప్రతి పిల్లవాడికి చెకప్స్ చేస్తారని, రెండుసార్లు పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తారన్నారు. ఏమైనా లోపం వుంటే డాక్టర్లు పెద్ద ఆస్పత్రులకు సిఫార్సు చేస్తారన్నారు. పిల్లలు ప్రతి గురువారం ఐరన్ మాత్రలు, ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది బాలు, దినేష్ ఆర్ముగం, పయని గ్రామ నాయకులు, ప్రధానోపాధ్యాయురాలు సాయి గీత, టీచర్స్, హెల్త్ సూపరు వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పి ఎస్‌లు, ఏఎన్ఎంలు, ఆశా కార్య కర్తలు పాల్గొని విజయవంతం చేశారు.

మహారాజశ్రీ గూడూరు 7వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

O.S.No. 5/2020

1. **వేమారెడ్డి శ్రీధర్ రెడ్డి** & వగైరాలు - వాదులు

Vs

1. **వేమారెడ్డి ఇందిరమ్మ** (Died)
2. **యరాటపల్లి జానకి రామ్ రెడ్డి**

& వగైరాలు - ప్రతివాది

నోటీసు

To,

D34/R34. **అక్కయ్యగారి చిన్నపోలయ్య,** తండ్రి లేట్ **శ్రీనివాస సత్రం,** కోట మండలం, తిరుపతి జిల్లా.

D35/R35. **యల్లసిరి శీనయ్య,** తండ్రి **వీరయ్య,** R/o శ్రీనివాస సత్రం, కోట మండలం, తిరుపతి జిల్లా.

D37/R37. **సీతు వెంకటయ్య,** తండ్రి **ముత్యాలయ్య,** R/o శ్రీనివాస సత్రం, కోట మండలం, తిరుపతి జిల్లా.

D45/R45. **కండల సుమతి,** తండ్రి **సుబ్బయ్య,** R/o డోర్ నెం.13-194-1, గమళ్ళపాళెం, గూడూరు టౌన్, తిరుపతి జిల్లా.

D49/R49. **మైలు సరోజనమ్మ,** భర్త **చిన్నయ్య శెట్టి,** R/o తమ్మినపట్నం గ్రామం, చిల్లకూరు మండలం, తిరుపతి జిల్లా.

D50/R50. **మేకల కన్నయ్య,** తండ్రి **సుబ్రహ్మణ్యం,** R/o తమ్మినపట్నం గ్రామం, చిల్లకూరు మండలం, తిరుపతి జిల్లా.

R61. **ఆలపాక లక్ష్మమ్మ,** భర్త లేట్ **బాలయ్య,** R/o లింగవరం, వరగలి పోస్టు, చిల్లకూరు మండలం, తిరుపతి జిల్లా.

R62. **ఆలపాక రఘు,** తండ్రి లేట్ **బాలయ్య,** R/o లింగవరం, వరగలి పోస్టు, చిల్లకూరు మండలం, తిరుపతి జిల్లా.

R63. **త్రావగుంట మునీంద్ర,** తండ్రి లేట్ **చిన్న వెంకట సుబ్బయ్య,** R/o లింగవరం, వరగలి పోస్టు, చిల్లకూరు మండలం, తిరుపతి జిల్లా.

R64. **త్రావగుంట శివ ప్రసాద్,** తండ్రి లేట్ **చిన్న వెంకట సుబ్బయ్య,** R/o లింగవరం, వరగలి పోస్టు, చిల్లకూరు మండలం, తిరుపతి జిల్లా.

ఇందుమూలంగా తెలియజేయడం ఏమనగా పై నెంబరు దావా I.A.74/2022, I.A.77/2022, I.A.78/2022, I.A.81/2022, ల నందు గౌరవనీయులైన 7వ అదనపు జిల్లా జడ్జి కోర్టు వారు మీకు దావా సమను నోటీసును **తే20-12-2024ది** న వాయిదా వేసియున్నది కావున ఎట్టి అభ్యంతరములు ఉన్నయెడల పై తెలిపిన కోర్టు నందు **తే20-12-2024ది** న **ఉదయం 10.30 గంటలకు** స్వయంగా గానీ వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల ఎటువంటి అభ్యంతరములు లేనట్లుగా భావించి మీ పరోక్షమున తీర్మానించబడును.

ఆర్.సత్యనారాయణ, నెల్లూరు.
బి.బాలప్రదీప్, కోట.
వాదితరపు న్యాయవాదులు

పోటీల్లో వెరిటాస్ విద్యార్థుల విజయదుందుభి

ప్రజాశక్తి -రామచంద్రపురం: మండలంలోని రామాపురంలోని వెరిటాస్ సైనిక్ పాఠశాల విద్యార్థులు బ్రాస్ బ్యాండ్ విభాగం రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరచి ద్వితీయస్థానం సాధించి విజయదుందుభి మోగించారని పాఠశాల డైరెక్టర్ బి.శ్రీకర్ రెడ్డి శనివారం తెలిపారు. ఈనెల 14న విద్యాశాఖవారి సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కర్నూలులో జరిగిన బ్రాస్ బ్యాండ్ విభాగంలో వెరిటాస్ సైనిక్ పాఠశాల విద్యార్థులు 13 బ్యాండ్ టీమ్లు పాల్గొని విజయం సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా శనివారం అభినంద సభ నిర్వహించి విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన కరుణాకర్ ను పాఠశాల చైర్మన్ డాక్టర్ బి శేషారెడ్డి, డీన్ సి.జి.హెచ్.ఖాన్, ప్రిన్సిపాల్ డా. పి.ఆర్ యస్.చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ నాగార్జున అభినందించారు

రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులు